నా పేరు జగన్నాథం.

అంచేతనే ఏమో–


నాకు జ్ఞానం వచ్చినప్పటినుంచీ పూరీకి వెళ్ళాలని వుండేది.

ఆ కోరిక వలభై రెండేళ్ళకు నెరవేరింది.

మా తాతగారి పేరు జగన్నాథంట. అంచేత నాకీ పేరు పెట్టారట. మరి తాతగారి తాత పేరూ ఇదేనా? ఏమో ఎవరికీ తెలీదు.

తిరుపతి వెంకన్న–
సింహాద్రి అప్పన్న–
భద్రాద్రి రామయ్య–
పూరీ జగన్నాథం.
ఆ విధంగా పూరీ నా మనసులో నాటుకుపోయిందేమో.

ఒకసారి మా మేనత్త ఒకావిడ చాల మందితో కలిసి కాశీ, గయ, తీర్థయాత్రలు వెళ్ళి వస్తూవస్తూ పూరీనుండి తెచ్చింది



జగన్నాథుడి పటం. ఆ ఆకారం చాల విచిత్రం అనిపించింది. ఆ జగన్నాథుడు అందరు దేవుళ్ళలాగా 'అజానుబాహుం అరవింద దళాయతాక్షం' అన్నట్లుగా లేడేమిచెప్మా– అన్పించింది. ఎవ్వరినడిగినా సరిగా చెప్పలేకపోయారు.

మనసు మారుమూలలో ఎక్కడో ఆ 'మిస్టరీ' అలా వుండిపోయి వుండాలి.

.....కాలేజీ చదువు లయ్యేసరికే అమ్మానాన్న దాటుకున్నారు. జీవితకాలం నాతోబాటు నడుస్తుందనుకున్న లక్ష్మి-రెండేళ్ళపాటు నా భవిష్యత్తుకు అర్థంగా కన్పించిన లక్ష్మి- తటాలున అమెరికా వెళ్ళి స్థిరపడిపోయింది. ఆమె అమెరికన్ భర్తకు పెద్ద వ్యాపారం. వాళ్ళకు ఇప్పుడు ఇద్దరు పిల్లలు కూడానట.

గత రెండు దశాబ్దాల జీవితమూ ఒంటరిగానే గడిచింది. అడ్వర్టయిజింగ్ ఎగ్జిక్యూటివ్‌గా భుక్తికేం లోటులేదు. విలాసాలకూ కొదువలేదు. పార్టీలు, విమాన

యానాలు, ఫైవ్‌స్టార్ హోటల్స్, అయి
దారు గంటల పరిచయాలు, ఈ రకరకాల
స్నేహాలు-ఇలా అన్నింటిలోనూ వుంటూ,
అందరితోను తిరుగుతూ దేనికీ అంటక,
ఎవరికీ చెందక గడుస్తూంది జీవితం.
అందుకనేనా పెళ్ళంటూ వుండాలంటారు!

కలకత్తాలో మీటింగు ముగించుకుని కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాను. వంశధారకు వరదలొచ్చి రైలు మార్గం మునిగిపోయిందని రైలు బండిని కుర్దాలో ఆపివేయడంతో మద్రాసు వెళ్ళాలన్న ప్లానంతా మారిపోయింది. ఆ పూట చెప్పింది. ఆ లెక్కను మొన్న రాత్రి గ్రాండ్ హోటల్‌లో నేనూ 'పాసింజర్నే'....

కాని.... కాని....

ఆ ప్రయాణం, అది ప్రయాణమేనా. గిరగిరగిరాం.... పడిలేవని కదలి తరంగాం— వడివడిగా మది విడివడిన శరీరాం— శరీ-మది-రాం!

రైలింకా కదల్లేదు. అదుగో అటు వైపు పట్టాల పక్కన, పడివున్నపొట్లాం ఎంగిలాకులలో మిగిలిన వాటిని కక్కుర్తిగా తింటున్న ఆ కుర్రవాడు.

తటాలున లేచి కూర్చుని ఆయనకు చోటిచ్చాను.

ఆయన ఏదో చదువుకుంటూ కూర్చున్నాడు. కష్టపడి ఆ పుస్తకం పేరు చదవగలిగాను. "రోమియో ఎర్రర్!" చాలా తమాషాగా వుందే అనిపించింది.

రైలు కదిలింది. మాటలు కలిశాయి. ఆయన కటక్‌లో వ్యాపారి; పూరీకివతల గ్రామంలో కూతురుంది. వెళ్తున్నాడు.

నా ప్రయాణ విషయం చెప్పాను. చాలా సంతోషించాడు.

"ఈ విధంగా ఆ స్వామి మిమ్మల్ని పిలిపించాడన్న మాట!" అన్నాడు చిరునవ్వుతో. నేనూ నవ్వి తల ఆడించాను. ఆ స్వామి వాళ్ళ జీవితాలలో భాగస్వామి అన్నమాట.

"చాలామంది వెళతారు. జగన్నాథుడి దర్శనం చేసుకుంటారు. పూజలు చేయి



# వాకాటి పాండురంగారావ్

హైదరాబాదు ఫ్లయిట్ కూడా లేదుట. అంచేత కుర్దాస్టేషన్‌లో నిల్చునివున్నాను.

అప్పుడు అవతలి ప్లాట్‌ఫారం మీదకొక బండి వచ్చింది. నా పక్కనున్న తజ్జీ అడిగితే అది పూరీ పాసింజరని చెప్పాడు.

అంతే!

పూరీ టిక్కట్టు కొనుక్కుని ఆ బండినెక్కాను.

ఇది పూరీ పాసింజరు.

నేనూ పూరీ పాసింజరునే.

ఇదీ, నేను ఒకటేనన్న మాట!

రైలులో వున్నంతసేపు రైలూ, ప్రయాణికుడు ఒకటే కద! దాని వేగమే అతడి వేగం; దాని దిశే అతడిది కూడాను.

—'పాసింజరం'టే ఇంకో అర్థం వుందని విజయవాడలో ఒక హోటలు

నేనేకదూ?

నేనే వేగంగా పరుగెత్తే రైలుని, నేనే ఎంగిలాకు నాశించే శునకాన్ని.

జనంఒక్కొక్కరుగాఎక్కుతున్నారు. అమాయకుల్లా, అనాగరికుల్లా అన్పిస్తున్నారు. అందుకు కారణం నాకు వారి భాష రాకపోవడం కావచ్చు.

దోసకాయ కొన్నాను. ఒకటి పావలా. ముక్కలు చేశాడు. ఉప్పుచల్లిఇచ్చాడు. ఆ ముక్కలు ఒక్కొక్కటిగా కొరికి తింటుంటే హాయిగా వుంది. పడుకుని విలాసంగా ఒక్కొక్కముక్కా తింటున్న వాడిని వులిక్కిపడ్డాను.

"నేనిక్కడ కూర్చోవచ్చునా" అని ఇంగ్లీషులో అడిగినాయన తెల్లగా బొద్దుగా వున్నాడు. నల్లఫ్రేముకళ్ళజోడు వెనకాల కళ్ళల్లో విద్యా వినయమూ స్ఫురిస్తున్నాయి.

స్తారు. ప్రసాదాలు తింటారు. పటాలు, బొమ్మలు కొంటారు. కాని ఎవరికోగాని ఆ జగన్నాథుడి విగ్రహం అలా వింతగా ఇతర దైవ విగ్రహాల కన్నా భిన్నంగా వుందేమా- అని అన్పించదు." అంటూ ఆయన యథాలాపంగా మొదలుపెడుతుంటే నా లోలోపల భయంతో కూడిన సంతోషం కెరటమై లేచింది.

నా అంతరంగంలోని ప్రశ్న తెలుసుకోడానికి ఇతడెవరు! చిన్నప్పటినుంచి నన్ను వెంటాడిన సమస్యను గురించి నేనితడితో మాట్లాడకుండానే ఈ జవాబు ఇప్పుడిలా ప్రత్యక్షం కావడాన్ని కాకతాళీయం అనాలా, కాక కటాక్ష వీక్షణం అనాలా! కటాక్షం అనేది వుందా! ఉంటే అది పొందే యోగ్యత నాలో లేదే!

ఏమీ తోచలేదు.

ఆయన చెప్పసాగాడు.

"భగవంతుడు మనిషిని తన ప్రతిరూపంగా సృష్టించాడని బైబిల్ చెబుతోంది. దాని విషయం ఏమోగాని-మనిషి మాత్రం తనకు ప్రతిబింబంగా దేవుడిని మలచడం తథ్యం. అంచేతనే భయంతో తపించినప్పుడు భయానకమూర్తిని. ప్రేమకోసం విలపించినప్పుడు శాంతమూర్తిని సృష్టించుకున్నాడు. తనకు రెండుచేతులే వున్నాయి గనుక ఎనిమిది చేతులమూర్తి తనకన్న శక్తివంతమైనదని కల్పించుకున్నాడు. కాని- అదృష్టము, అవ్యవహార్యము, అగ్రాహ్యము, అలక్షణము, అంచిత్యము-అయిన శక్తి రూపం దగ్గర కొచ్చేసరికి, తనకు పరిచయమయిన లక్షణాలను, సంకేతాలను అధిగమించవలసివచ్చింది. అందువలననే ప్రతిబింబ సమానమైన ప్రతిమనుకాక, లక్షణం నుండి అలక్షణంలోకి, రూపం నుండి అరూపంలోకి తన మనసు ఎగిరి గంతులేయడానికి దోహదం చేయగల ప్రతీకను సృష్టించుకున్నాడు. మనసు నిలపడానికయితే ప్రతిమ; మనసు నధిగమించడానికయితే ప్రతీక.... అలాటి ప్రతీకే పూరీ జగన్నాథుడు-" అంటూ ఆయన చెబుతోంటే కొంత అర్థమయింది; కొంత కాలేదు. ఉపనిషత్‌ల నుండి భగవద్గీత నుండి, పురుష సూక్తం నుండి అనర్గళంగా శ్లోకాల నుదహరిస్తూ వాటి భావం జగన్నాథుడి మూర్తిలో ఎలా దాగి వున్నాయో చెబుతుంటే చాల ఆశ్చర్యం అన్పించింది. అర్థంకానిదికూడా వినడానికి బాగుండడం చాలా వింతనిపించింది. అర్థానికి మనం ఇస్తున్నంత ప్రాధాన్యం లేదా?

పూరీ స్టేషన్‌కు ముందరి గ్రామంలో ఆయన దిగిపోయాడు. ఎంత దగ్గరగా, ఆప్యాయతతో మాట్లాడాడో అంత విభ్రరంగా,తటాలుననంచి పట్టుకుని అదృశ్యం అయ్యాడు. ....అయ్యో, ఆయన పేరు తెలుసుకోలేదే?....

పూరీ వచ్చింది. స్టేషన్ కొత్తగా వుంది. రిక్షావాడు తెలుగువాడే.... మూడు రూపాయలు ఇచ్చి ప్రభుత్వంవారి 'పాంథ నివాస్' హోటలుకు చేరాను. గది దొరికింది.

ఎలా-కార్డె భోజనం. నిద్ర.

సాయంకాలం ఐదింటికి హోటలు వాకిట్లో పరచుకునివున్న సముద్రం వేపు నడిచాను. వాలుకెంత మలామాలో పుల కించిపోతోంది పిలి పిలి సంద్రం. ఇసుకమీద, నీటిప్రక్కగా నడవసాగాను.

మనసు నిండా ఏ లాజిక్కుకూలొంగని ఆలోచనల కెరటాలు.

హఠాత్తుగా కేరింతలు విన్పించాయి.

ఇద్దరు జంటలు— ఒకే వరుసలో— భుజాలమీద చేతులు వేసుకుని గలగల నవ్వుకుంటూ, పెద్దగా కేకలువేస్తూ వస్తున్నారు. పాతిక ముప్పైయేళ్ళ మధ్య వుంటారేమో....నల్లగావున్నావిడ జీన్స్‌లో వుంది. ఆమె పక్కన ప్రింటెడ్ లుంగీలో నొక్కులజుత్తతను ప్రకటనలలోకన్పించే వ్యక్తిలా వున్నాడు. అతడి ఎడమచేతి చుట్టలో చెవికి పెద్ద గాజులంత రింగులు. చీరా ధరించిన స్త్రీ, ఆమెనంటి పెట్టుకొని స్పోర్ట్స్ బనియన్ పంట్లాంలలో అజాను బాహు వాకతను-అదీ వరస....

వయసులో కాకపోయినా మూడ్ దృష్ట్యా 'మాడ్' తరం అన్పించే వారిని గమనించి దాటిపోయాను. ఏ భువనేశ్వర్‌కు చెందిన సంపన్నులో కాబోలు, పిక్‌నిక్‌కు వచ్చి వుంటారు. ఎంజాయింగ్ ఏ హాలిడే!

ఎడమవైపు తిరిగాను. రోడ్‌మీదకు వచ్చాను. ముచ్చటయిన బంగళా కన్పించింది. దాని గుమ్మంమీద ఏదో 'నాయుడు' అని వుంది! ఆ ప్రక్కనే అదేదో 'ఇన్స్' అన్న బోర్డు కనుపించింది. ఫరవాలేదే. మనవాళ్ళు కూడా ఇంత దూరం వచ్చి ఒక వసతి గృహం నడుపుతున్నారు- అనుకుంటుండగా ఒక దృశ్యం కనుపించింది. ఆ లాన్‌లో పేము కుర్చీలమీద, గడ్డిమీద కూర్చున్న విదేశీ స్త్రీలు కనుపించారు.వారందరూ మెరిసిపోయేకంగులో బట్టలు ధరించినట్లున్నారు.

అడుగు ముందుకు వేశాను.

జగన్నాథుడి గుడికి రిక్షా మాట్లాడుకున్నాను. మళ్ళీ తెలుగు రిక్షాయే....


రిక్షా దిగాను.


ఆ వీధి వెడల్పుగా, ఇటూ అటూ దుకాణాలతో, పాతకాలంనాటి మేడలతో జన సందోహంతో, అరుపులతో,ఆవులతో అడ్డంగా ఆపిన వాహనాల శ్రేణితో కోలాహలంగా వుంది. అది పూరీ రాజుగారి మేడట. ఇది శంకరాచార్యుల మఠం జాలూకు భవనంట. "కారే రాజుల్!...." రాజ్యాలు పోయాయి. రాజులున్నారు. పీఠాలు నడలాయి, అధిపతులున్నారు.

వద్దు మొర్రో అని విదిలించుకుంటున్నా వదలని గైడు ఏకరవు పెడుతున్న మాటలొకటీ అరా చెవినిపడుతున్నాయి.

అల్లదుగో.... ఆ చెట్లమీంచి ఎత్తుగా, విశిష్టమైన వాస్తు విన్నాణంతో, మధ్య మధ్య నొక్కులున్న వర్తులాల నొకదానిపై నొకటిగా పేర్చినట్లుగా, ఈ మందీ మార్బలమూ, కోలాహలమూ, హాలాహలమూ వీటన్నిటికన్న ఎత్తుగా ఆకాశంలోకి చొచ్చుకుపోతున్నట్లున్న ఆలయ విమానాలు.

కొన్ని శతాబ్దాల క్రింద మనిషి చేయి మలచిన ఆ గూడు కింద ఒక బొమ్మ: ఆ బొమ్మను దేవుడని పిలుచుకున్నాడు






మనిషి. అదే తన తల్లీ,తండ్రీ, సఖుడు గురుడు అని నమ్మాడు. నమ్ముతూ నమ్ముతూ ఆ నమ్మకంతోనే ప్రొపెలర్ అయి జెట్‌లా పైకి లేచాడు. దాంతోనే క్రిందకు,బాగా క్రిందకు కూలిపోయాడు. ఆ బొమ్మ ఇదంతా చూస్తూనే వుంది. తనకేమీ పట్టనట్లు నవ్వుతూనే వుంది. కాని, కాని ఆ బొమ్మ కారణంగా ఇన్ని లక్షల మందికి జీవనాధారం లభించింది. ఔను. దేవుడి దయవల్ల కూడా ప్రయోజనాలు ఉన్నాయి.

నా ఆలోచనల వరుసకు నాకే నవ్వొచ్చింది.

పండాలను, గైడ్లను, ప్రసాదాల విక్రేతలను వదిలించుకుని ఆలయం మెట్లెక్కాను.

ముఖ మంటపంలోకి అడుగుపెట్టాను గరుడ స్తంభం దాటాను.

'అదుగో అల్లదుగో శ్రీహరివాసము!'

అశేష జనావళి తలలమీదుగా అదుగో జగన్నాథుడు....నల్లగా పొట్టిగా, వింతగా విలక్షణంగా ఆయన కిటూ అటూ రుక్మిణీ బలభద్రులు.

రైల్లో ఆయన చెప్పినవన్నీ గుర్తుకు రాసాగాయి.... ఆయన పేరు.... పోనీ లెద్దూ ఆయన చెప్పినది మనసులో మారు మోగుతూండగా ఆయన పేరు ఎందుకూ? చిల్లర వివరాలకు ప్రాధాన్యం ఇచ్చే మనసు తృప్తి కోసం 'వ్యాఖ్యాత' అనుకుంటే పోలేదూ?

"హరే కృష్ణా!"

ఆ ఉచ్చారణలో ప్రత్యేకత నా మెడను తిప్పింది. కాషాయ ధోవతి, అదే రంగు కుర్తా, పిలక, నుదుట గంధంతో నామంలా తీర్చిన బొట్టు- తన్మయత్వంతో జగన్నాథుడిని చూస్తున్నాడా పాశ్చాత్యస్వామి.

అతడి కళ్ళిటు తిరిగాయి.

'హలో' అన్నాను నేను.

'హరే కృష్ణా!' అన్నాడతను వెన్నెల వంటి దరహాసంతో.

ఇద్దరం కలిసే ఆ ప్రాకారంలోని చిన్న చిన్న మందిరాలను, శిల్పాలను, కృష్ణుడి జీవితకథను చెప్పే బొమ్మల మ్యూజియంను చూశాము. కృష్ణుడి పేరు చెప్పినా, మూర్తి చూసినా అతడికి కలిగే ఆనందం అతడి మొహంలో పండగై పండుతున్నది. అది చూసినప్పుడెల్లా నాలో అసూయలాంటిది, ఆ వెంటనే జాలి కలుగసాగాయి. 'మనం వద్దని పారేసినదేదో ఏరుకుని తద్వారా ఇంత ఆనందంగా వున్నాడే ఇతడు-' అని అసూయ: ఆధునిక విద్యను ఔపోసన పట్టి నాగరికతలోకి పారిశ్రామిక జీవనంలోకి అడుగుపెడుతున్న మనం బూజు అని గ్రహించి తీసి పెంటకుప్పలోకి పారవేసిన దానిమీద అయ్యో పాపం. ఇతగాడు మోజుపడి, ఆ మత్తులో జ్ఞానం కోల్పోతున్నాడే- అని జాలి.

నంద్రిగామ్-ఔను అదే అతడిఇప్పటి పేరు: డెట్రాయిట్‌లో కంప్యూటర్ సైంటిస్టుగా వున్న జెర్రీ డ్రామన్, ప్రభుపాదస్వామిని చూడగానే మారిపోయాడు. పేరు, తీరు, వేషం, భాష అన్నీ మారిపోయాయి.

"జగన్నాథుడంటే కృష్ణుడే—ఈ కలియుగంలో హరేకృష్ణ స్మరణాన్ని మించినది లేదు. భాగవత పఠనం మనస్సుకు చాల హాయినిస్తుంది.-'పురుషశ్చైవ మాం ధీరా సాంఖ్య యోగ విశారదా" అంటూ అతడు కొద్దిపాటి ఇంగ్లీషు వాసన వేసే ఉచ్చారణతో భాగవతాన్నుంచి శ్లోకం ఉదహరిస్తుంటే నాకు సిగ్గువేసింది. మనం 'మృతభాష' అని ఈసడించే ఈ అమెరికన్లూ, జర్మన్లూ ఏం చూడగలుగుతున్నారు.

ఈలోగా అటు వచ్చిన పాశ్చాత్య మహిళల బృందం "హరే కృష్ణ!" అంటూ అతడిని,నన్ను పలకరించింది.ఆరుమందికీ నాయకురాలిలాటి ఆవిడ బొద్దుగా వుంది. "ఈమె దేవకి...." అంటూ పరిచయం చేశాడు నంద్రిగామ్. వారిలో పదేళ్ళమ్మాయికాంతి. అద్దాలు కుట్టిన పరికిణీతో రవికతో, రెండు బంగారురంగు జడలతో ముద్దుగా వుంది. "మామ్! నాకు పెరుగు కావాలి" అని అడగడంతో కాంతిని తీసుకుని అవతలకు వెళ్ళింది దేవకి. కాంతికి ఆమె తల్లి.

వాళ్ళందరూ హరేకృష్ణ భక్తులే. అదవారంతా వేరుగా 'ఇన్న్'లో వుంటున్నారు. నంద్రిగామ్ కాక ఇంకో ఇద్దరు అమెరికన్ భక్తులు నేనుంటున్న 'పాంథనివాస్' లోనే వుంటున్నారట!

కాంతి పెరుగున్న చిన్నమట్టిపాత్రతో ఎగురుకుంటూ వచ్చింది. "డాడ్! ఇదుగో. ఎంత బాగుందో తినిచూడు-" అంటూ నంద్రిగామ్ దగ్గరకు వచ్చింది. అతడామె తలని నిమురుతూ...."ఎందుకు బాగుండదమ్మా.... పాలు పెరుగు వెన్న అంటే ఇష్టపడే కృష్ణుడి భూమమ్మా ఇది ..." అన్నాడు.

కృష్ణప్రాణః, మమప్రాణః
కృష్ణజీవః మమజీవః
వాఙ్మనః శ్రోత్ర జిహ్వాఘ్రాణైః
ఉచ్ఛ్వాస్వరూపేణ బహిరాగత్య ॥

వారిది మూర్ఖత్వమా, తన్మయత్వమా? గ్రీన్ కార్డ్ కోసం ఇక్కడివెంకయ్యలు, సుబ్బమ్మలు విలవిలా కొట్టుకు చచ్చిపోతూంటే, ఆ అమెరికాను అవకాశాలను, ఐశ్వర్యాలను వదలి ఈ మురికిలో ఈ కుండపెంకులోని పులిసిన పెరుగులో

కృష్ణుడిని చూస్తున్నారే. ఇది కృష్ణుడు పుట్టిన భూమి అని మరిచిపోతున్నారే....

"బ్రతుకుతూ బ్రతుకుతూ మేం పోగొట్టుకున్న జీవనం ఏది ?

విషయాలు సేకరిస్తూ మేం పారేసుకున్న ప్రజ్ఞానం ఎక్కడ—

వాస్తవాలు పోగుచేస్తూ మేం విసిరేసిన జ్ఞానం ఏదీ.ఎక్కడ?...."

అన్న ఇలియట్ పంక్తులకు అర్థం ఇదేనా...

నంద్రిగామ్ ఉత్సాహంగా చెబుతున్నాడు. రేపుదయం మామూలుగా వాల్గింటికి లేచి సముద్రంలో స్నానం చేసి. ధ్యానం. సంకీర్తన. భాగవత పఠనం ముగించి- అరింటికల్లా ఇన్న దగ్గరికి వెళ్తారట. అక్కడ అరవాళ్ళు కలుస్తారు. అందరూ కలిపి భువనేశ్వర్ వెళ్ళి అక్కడినుంచి మయాపురికి వెళతారట. అక్కడ చైతన్య మహాప్రభు జన్మ దినోత్సవం అటపాటలతో. నాట్యాలతో సంకీర్తనలతో పరమానందంగా జరుపుతారట. అందుకోసం ఏడాది పొడుగునా ఎదురు చూస్తుంటాం.... అతడి మాటలలోనే ఆ ఆనందం ప్రస్ఫుటం అవుతోంది. అతడిని మూర్ఖుడనడానికి నేనెవరిని? అంతటి నిండైన ఆనందం అతడిదయినప్పుడు. నా నామకరణాలతో అతడికి నిమిత్తం లేదు కదా....

'హరే కృష్ణా!' అన్న వీడ్కోలుతో విడిపోయాం.

రాత్రి హోటల్లో భోజనం దగ్గర- "హాయ్" అన్నాడొకాయన- చేయిజాస్తూ "వి. ఎం. సూదన్" అని పరిచయం చేసుకున్నాడు. కేకేసి.... 'కుంతల్' అని పల్లగావున్న స్త్రీని పరిచయం చేశాడు. ఆమె అతడిమీదకు వాలిపోయి నా వైపు చేయి చాచింది-'హాయ్' అంటూ.

ఔనౌను. సాయంకాలం సముద్ర తీరాన కనబడిన రెండు జంటలలో ఒకటి ఇది. మరొకటి? అడిగాను. నవ్వుతూ చెప్పాడు "మనోజ్ అండ్ మాలా.... వస్తున్నారు.వై డోన్ట్ యు జాయిన్ అజ్ ఫార్ గ్రబ్?"- సూదన్ అనబడే మధుసూదన్.

గ్రబ్ అంటే పురుగుల లార్వాలు పిల్లలు: వీరి 'హాయ్ హాయ్' ఇంగిలీసులో భోజనం....

'ఓకే'అన్నాను.ఏ గూటిలో ఆ పలుకు కదా. చిలకా! అనుకుంటూ.

రెండో జంట కూడా వచ్చింది. మనోజ్ మాలలు దంపతులు. కుంతల్— సూదన్ గర్ల్ ఫ్రెండ్. వాళ్ళు సరదాగా మాట్లాడుకుంటున్నారు. ఒకరిమీద ఒకరు పడిపోతుంటా పుండలేకపోతున్నారు.

గ్లాసులు. బాటిలు. ఐస్ పెయిలూ వచ్చాయి. వాళ్ళ గురించి చెప్పారు. ఢిల్లీ నుంచి వచ్చారట.

నా పర్యటనానుభవాలు, జోకులు చెబుతూంటే విపరీతంగా నవ్వుతున్నారు. పర్దన మొదలయింది.

భోజనం చేస్తున్నాము.... ఇంకో జోక్ మొదలుపెట్టాను.

"అమెరికాలో ఒకమ్మాయికి ఒంట్లో బాగు లేకపోతే డాక్టరు దగ్గరి కెళ్ళింది పరీక్షచేశాక డాక్టరు ఉషారుగా "తల్లీ! మీ వారికో శుభవార్త...." అన్నాట్ట. "నా కింకా పెళ్ళికాలేదే-" అందిట ఆమె. "అయితే నీప్రియుడికో శుభవార్త"అంటే "నా కెవరూ ప్రియుడు లేడే!" అందిట ఆ అమ్మాయి. వెంటనే డాక్టర్ చాల భయ భక్తులతో-"అలాగయితే అమ్మడూ! రెండవ క్రీస్తు జననానికిసిద్ధంగా వుండు" అన్నాట్ట."

అని జోక్ ముగించానో లేదో ఫెళ్ళున అందరూ నవ్వుతుండగా, హఠాత్తుగా లేచి నా మొహం తిప్పి బుగ్గమీద ముద్దుపెట్టుకుంది కుంతల్: 'గ్రేట్' అంది.

నే నాశ్చర్యపోయాను. సిగ్గుపడ్డాను. మిగతా ముగ్గురూ ఇదేదో చాలా రొటీన్ వ్యవహారం అన్నట్లుగా నవ్వుతూనే వున్నారు. డైనింగ్ హాల్లో ఇంకెవరయినా చూశారేమో!

భోజనాలయ్యాక లేచాం. "బీచిలో వాక్ కు వెళదాం వస్తారా?"-అని అడిగాడు మనోజ్.

'సారీ! వేరే ఎంగేజ్మెంటుంది-' అని నా దారిని నేను వచ్చేస్తున్నాను. రోడ్ మీదకు వెళ్ళాను సిగరెట్ల కోసం. రిక్షా గంట మోగింది. రోడ్ మధ్యనున్న నేను పక్కకు తప్పుకునేలోగా రిక్షా నన్ను తోసినంత పనిచేసి ఆగింది.

"జగన్నాథ్!"

తలెత్తి చూశాను. నంద్రిగామ్!

దిగాడు.

పొద్దున వెళ్ళిపోతున్నాము కదా. మళ్ళీ జగన్నాథుడిని ఎప్పుడు చూస్తామో. ఏమిటో ఇంకొక్కసారి ఇప్పుడు వెళ్ళి చూద్దాం అన్పించిందిట. అందుకని పది గంటలవుతుండగా తాను బయలుదేరాడుట. 'మీ రొస్తారా!' అని అడిగాడు.


రిక్షా ఎక్కాను.


దిగాము.

మందిరం ప్రశాంతంగా వుంది. అర్చకులు. నలుగురైదుగురు భక్తులూ తప్ప ఎవరూ లేరు.

జగన్నాథుడి ఎదుట నిలబడ్డాను.

"అనాది మధ్యాంతం" అని అర్జునుడన్నట్టు ఆద్యంత రహితుడు గనుకనే ఆ తల భాగం, పాదభాగం అంత చదునుగా వుంది.... 'నతత్ర సూర్యోభాతి నచంద్ర తారకం,.... అంటుంది శ్వేతా






శ్వేతరోపనిషత్. సూర్య చంద్రాదులు వెలగని మూలతత్త్వం కనుకనే ఆ నల్లటి రంగు.... "సిద్ధం సాక్షిత్వం అస్యపురుషాయ" అన్న సంఖ్యాకారిక చెప్పినట్లు ఆ కళ్ళు రెండూ సాక్షిత్వానికి గుర్తులుగా వున్నాయి. రెప్పలుంటే లిప్త కాలం అయినా మూతపడతాయి. అలా మూస్తే సాక్షిత్వానికి భంగం కల్గుతుంది. అందుకనే త్యాగయ్య పాడినట్లుగా సూర్య సుధాకర లోచనాలున్నాయి. 'మహాబాహూ' అన్న గీతలోని అర్జునుడి సంబోధనకు చిహ్నాలు ఆ బలిష్ఠమైన బాహువులు. అరచేతులుంటే కర్తవ్యం సూచితం అవుతుంది. అందుకని అవి లేని బాహువులున్నాయి. పాదాలు చలనానికి గుర్తులు గనుక అవి లేకుండా కాళ్ళున్నాయి. 'అపాణి పాదో' అన్న ఉపనిషత్ వర్ణనకిది రూపకల్పన. ఈ విధంగా కేవలం అంశలు మాత్రమే సంపుటీకరించబడిన ఈ ప్రతీక 'సర్వేంద్రియ గుణా భాసమ్, సర్వేంద్రియ వివర్జితమ్, సర్వస్య ప్రభు మీశానం సర్వస్య' అన్నట్లుగా సర్వ జగత్తుకూ నాథుడై వున్నాడు ఈ జగన్నాథుడు. ఈ అంశలు ఇంతకన్న తక్కువయితే మనం పోల్చలేము. ఇవి ఇంతకన్న ఎక్కువయితే వాటిని అధిగమించలేము. అదీ జగన్నాథుడి రూప రహస్యం-"

రైలు వ్యాఖ్యాత మాటలొక్కొక్కటి స్పష్టంగా, గంభీరంగా వివరిస్తుంటే ఆ మాటలే ఎదుట వున్న రూపంగా కనపడుతుంటే గర్భగుడిలోపల రైలుపెట్టెలోపల గుడిలోపల రూపంలోంచి పొద్దుటి మాటలిప్పుడు వెల్వడుతుంటే- కాలం స్థలం-అయింది; స్థలం కాలమయింది, రెండూ కలిసిపోయి తెల్లగా జాలువారే జుత్తుతో వున్న వృద్ధమూర్తిగా లీలగా కన్పిస్తే అది ఐన్‌స్టీనా కపిలుడా తెలియలేదు....

"....అందుకనే నేనీదేశానికి వచ్చాను. మీరు ఈ ప్రతీక గురించి వివరించిన విధానం వింటుంటే శరీరం గగుర్పొడిచింది. ధన్యవాదాలు హరేకృష్ణా! హరేకృష్ణా!...." కనుల అంచుల నీరు జాలువారుతుండగా నంద్రిగామ్ చెప్పింది నాకాశ్చర్యం కల్గించింది.

ఏమిటి? రైలు వ్యాఖ్యాత నాతో మాట్లాడుతున్నాడని నేననుకుంటుంటే, నేను ఇతడితో మాట్లాడానని ఇతడంటున్నాడే.... ఏమిటీ భ్రమ?

"....అయ్యా.... కదలాలి...." అన్నట్లుగా గుడి వారెవరో హెచ్చరించారు.

కదిలాము. సెలవు తీసుకున్నాము. నడుచుకుంటూ పాంథనివాస్ చేరాను.

పన్నెండవవస్తుంది. మేడ మీద నా గదిలోకి వెళ్ళాను. డైరీ తీశాను. ఏమీ రాయలేకపోయాను. మూసేశాను.

వరండాలోకి వచ్చాను. మందంగా వెల్గుతూంది బల్బు. ఎదుట వంద గజాల దూరంలో చీకటిలో అజ్ఞాత వీరుడిలా హూంకరిస్తూంది సముద్రం.

హఠాత్తుగా కుడిచేతి వైపు అలికిడి అయింది. ఎవరో వస్తున్నారు.

ఇద్దరు.... దంపతులల్లే వున్నారు. గాఢంగా ఒకరి నొకరు పొదివి పట్టుకుని నడుస్తున్నారు. అతడు ఆమె ముంగురులను తన నోటితో దిద్దుతున్నాడు. అతడిని అల్లుకుని పోయి నడవలేక నడుస్తూంది ఆమె. వారీలోకంలో లేరు.

నేనే పక్కకు తొలిగాను. నన్ను గుర్తించకుండానే దాటిపోయారు.

అరె!

అది మాలా కదూ? ఆ అజానుబాహువు మనోజ్ కాదు. మధుసూదన్!

—వరండా లైటార్పాను.

కిందకి దిగాను.

పచ్చటి గడ్డి తివాసీ మీద నుంచి పాదాలు ఇసుకలోకి నడిచాయి.

నడిచి నడిచి అంచుకు వెళ్ళి కూలబడ్డాను.

అలలు అర్థం లేకుండా గొడవ చేస్తున్నాయి.

ఏదో అందుకోవాలని పదే పదే ప్రయత్నించి సాఫల్యం పొందక తునాతునకలై విరిగి, కిందపడి వెనక్కి వెళ్ళిపోతున్నాయి.

ఇసుకమీద చేరగిలబడి పడుకున్నాను. తలక్రింద తలగడాలా ఎత్తుగా ఇసుక పోగుచేసి దానిమీద రుమాలు పరచి తల నానించాను.

ఆకాశం నిండా నక్షత్రాలే. చంద్రుడు లేడు.

'చికురమ్ బహుళం, విరళం
భ్రమరం
మృదులం వచనం, విపులం నయనం'

—మందంగా పాట విన్పిస్తూంది.

అరె....నిద్రపోయినట్లున్నాను....

'అధరం మధురం వదనం లలితం
చపలం చరితం చకదానుభవే!'

—సందేహం లేదు. ఆ ఉచ్చారణ నంద్రిగామ్‌దే. స్నానం చేస్తున్నాడు కాబోలు- ఆనందంగా ఎలుగెత్తి పాడుకుంటూ.

వాచీ చూశాను. నాలుగూ పది అయింది.

చీకటింకా వుంది.... కాని

ఆకాశమూ, సముద్రమూ కలిసే చోట వెలుగురేక లాంటిది వికసిస్తూంది!

అంకితం :- [ప్రొఫెసర్ చంద్రశేఖర రథ్ గారికి!]